నేటి దానవులు

చంద్రశేఖర అజాద్

నిలువుటద్దం ముంగు కూర్చుంది వాసంతి. అందులో తన మొఖం ఎంతో అందంగా కనిపిస్తోంది. కొంచెం పౌడర్ తీసుకొని మొఖానికి లైట్ గా అద్దింది. సెంట్ స్ప్రే చేసుకొంది. తలలో చిన్న మల్లెపూలదండ వుంది. లేచి నిలబడింది. తన అలంకారం తృప్తిగా ఉందనిపించాక వెనక్కు తిరిగింది.

హాండ్ బ్యాగ్ తెరిచి తిరిగి డ్రెస్సింగ్ టేబుల్ దగ్గరకు వచ్చింది. సాయగులాగ నెయిల్ పాలిష్, లిప్ స్టిక్, చిన్న పౌడర్ డబ్బా, ఖరీదయిన సెంట్ బ్యాగ్ లో సర్దుకుంది.

ఫారిన్ నైలెక్స్ చీరలో అద్భుతంగా, అప్సరసలా వుంది. చేతికున్న విదేశీ గడియారం వంక చూసింది.

టైం పదకొండు గంటలు కావస్తోంది.

"ఇంకా గంట" మెల్లగా అనుకొంది.

ఈలోపు ఏం చేయాలి? చల్లటిగాలి మేనును ప్రాక

తోంది. ఆ గది ఎ.సి. చేయించబడింది. అత్యంత ఆధునికమైన స్టీరియో రికార్డర్ ఉంది. ఆమెకు సంగీతం వినాలనిపించటంలేదు.

నడుచుకుంటూ వెళ్ళి టి.వి. ఆన్ చేసి సోఫాలో కూర్చుంది. పదినిమిషాలకు మించి చూడలేకపోయింది. తిరిగి లేచి ఆఫ్ చేసింది. టీపాయ్‌మీదున్న గ్లాసులో నీళ్ళు త్రాగింది.

ఫోన్ గణగణమంటూ మ్రోగింది.

అందుకొంది వాసంతి.

“హలో.”

“వాసంతేనా మాట్లాడుతుంది” అవతలినుండి ఓ పురుషుడి కంఠం.

“అవును.”

“వేరే ఎంగేజ్‌మెంట్స్ లేవుకదా.”

“పన్నెండు గంటలకో ఎంగేజ్‌మెంట్ ఉంది.”

“కాన్సిల్ చేసుకో.”

“లేదు. సాధ్యంకాదు.”

“నీకు తీరిగ్గా చెబుతాను. ఇది పొలిటికల్ ఇష్యూ. నువ్వు మరింకేం మాట్లాడకు” అవతల మాట్లాడుతున్న వ్యక్తి చనువుతో కూడిన అధికారంతో ఆజ్ఞాపించాడు.

“ఐయామ్ సారీ.”

“ఆగాగు. ఫోన్ పెట్టేయకు” అవతలనుండి బిగ్గరగా వినిపించింది.

“నేను వస్తున్నా.”

వాసంతి మౌనంగా రిసీవర్ క్రెడిల్ చేసింది.

ఆమె శూన్యంలోకి చూస్తోంది.

ఆలోచనల తరంగాలు ఉవ్వెత్తున లేచిపడుతున్నాయి.

తన జీవిత క్రమమంతా ఆమె కళ్ళకు కనిపిస్తోంది. ఆ జీవితం గుర్తుకు తెచ్చుకోవటం ఆమెకు ఇష్టంలేదు. బజర్ నొక్కింది.

పనిమనిషి లోపలకు వెళ్ళింది.

"కాఫీ చేసుకొస్తావా?"

"భోజనం చెయ్యండమ్మగారూ."

"ఆకలిగా లేదు."

"సరేనమ్మా."

పదినిమిషాల్లో వేడి కాఫీ వచ్చింది. త్రాగుతూ ఆలోచిస్తోంది. కాఫీ త్రాగి కప్పు క్రింద పెట్టాక హాల్లో బజర్ మ్రోగడం వినపడింది. పనిమనిషి తలుపు తీసింది.

ఖద్దరు బట్టలు ధరించిన ఓ పెద్దమనిషి కంగారుగా లోపలకొచ్చి, సరాసరి వాసంతి దగ్గరకు దూసుకొచ్చాడు.

"ఏమిటి వాసంతీ కోపమేమైనా వచ్చిందా?"

"కోపమా? దేనికి? ఎవరిమీద! కోపంవస్తే నేనెలా బ్రతకాలి?"

"ఈ రోజు గొప్ప ఛాన్స్....మంత్రిగారొచ్చాయి."

"మంత్రా...." మధ్యలో అడిగింది.

"కాబోయే మంత్రి .... అపొజిషన్‌లో అంత పవర్‌ఫుల్. వాడిని గనక తృప్తిపెడితే ఇంక మన పంట పండినట్లే."

"సారీ అని చెప్పానుకదా. నా ప్రోగ్రాం ఫిక్స్ అయింది. ఈ సమయంలో నేనేం చెయ్యలేను."

"వంట్లో బాగోలేదని ఫోన్ చెయ్యి."

"నో__అది నా అంతరాత్మకు విరుద్ధం" దృఢంగా అంది వాసంతి.

"అంతరాత్మ.... జోకు వెయ్యకు."

"ఎప్పుడుపడితే అప్పుడు జోకులు వెయ్యటం నా కల వాటు లేదు."

"అంటే సీరియస్‌గా చెబుతున్నావా?"

"దీంట్లో సీరియస్ ఏముంది. నాకు వేరే ప్రోగ్రాం ఉంది. నా అసహాయతను అర్థం చేసుకోమంటున్నాను."

"నేనూ చెప్పేదదే. నా బిల్లులు చాలా పెండింగులో ఉన్నాయి. లక్షల రూపాయలు ఈసారితో సెటిలవుతాయి. మీటరాఫ్ టూ అవర్స్. నీకు నాలుగురెట్లు పే చేస్తాను. కమాన్" జేబులో చేయి పెట్టాడు.

"మీరు ఎంత ఇవ్వగలరన్నది ప్రశ్న కాదు. దయచేసి ఇంకెవరినైనా ట్రై చెయ్యండి."

అతని మొఖంలో రంగులు మారిపోయాయి.

"ఇంకెవరో దొరక్క నీ దగ్గరకు రాలేదు. పెద్ద మనుషులతో యెలా వ్యవహరించాలో నేర్చుకోవటం మంచిది. నీ మేలు కోరి చెబుతున్నాను."

"మంచిది. మీ దయకు కృతజ్ఞతలు."

రక్తం మొఖంలోకి వచ్చి దతినికి.

"అఫ్ట్రాల్ ...." ఆ తర్వాత మాటలు కంట్రోల్ చేసుకోలేని ఆవేశం మూలంగా పూర్తి చేయలేక పోయాడు.

వాసంతి కూడా కోపంతో కదిలిపోయింది.

"ఊఁ పూర్తిచెయ్ .... అఫ్ట్రాల్ ఎ కాల్‌గర్ల్, ఎ బిచ్ నన్నే తిరస్కరిస్తుందా? అంతేగా నువ్వనేది? గెటవ్" అరిచింది.

అతను బుసలుకొడుతూ లేచాడు.

"నువ్వు .... నువ్వు ...." మాట్లాడలేకపోతున్నాడు.

"అవును. నేనే వాసంతిని. కాల్‌గర్ల్‌ని. బజారు మనిషిని. డబ్బుకోసం శరీరం అమ్ముకునే వేశ్యని. ఇంకా యెన్నెన్ని పేర్లుపెట్టి పిలుస్తారో వాటన్నింటిని. అంత మాత్రాన నేను మనిషిని కాదా? నాకో అభిప్రాయం అంటూ ఉండదా? నాకు నిజాయితీ లేదా? అంతరాత్మ ఉండంటే యెంతో అవహేళనగా మాట్లాడారు? యే కాల్‌గర్ల్‌కోసం మీరు పరిగెత్తుకొచ్చారో అదే మనిషి ఆఫ్ట్రాల్ అయిందా? నేను ఆల్‌రెడీ యెవరికో ఎంగేజ్ కాబడ్డానని ముందునుండి చెబుతున్నాను. అతని దగ్గర పేమెంట్ తీసుకున్నాను. అయినా వాటన్నింటిని కాదని నీ దగ్గరకు రావాలి.

వేశ్యలు శరీరాన్ని అమ్ముకుంటారు. నీతి నిజాయితీలను కాదు. శరీరంతో చేసేదే వ్యభిచారం కాదు. ఈ వ్యభిచారం అన్ని రంగాల్లోనూ ఉంది. యూ మైండిట్. మాకూ అభిమానం ఉంది. దట్సాల్. నువ్వేదో చేస్తానంటూ నన్ను బెదిరిస్తున్నావ్. నేను నా వృత్తి ధర్మం పాటించటమే అన్యాయం అయితే.... నేరమయితే.... నువ్వేంచేసినా మోస్ట్ వెల్‌కమ్!"

అనుకోని వర్షం ఒక్కసారి నిలువెల్లా తడిపేసినట్లయింది. అతని మొఖంనిండా చెమటలు....

"యూ విల్ పే ఫర్ దిస్" చాలా మెల్లగా వచ్చాయా మాటలు అతని నోటినుండి. అయినా వాసంతికా మాటలు వినపడ్డాయి.

"డెన్ గెటవుట్ బ్లడీ రోగ్" అరిచింది.

అతను గిరుక్కున వెనక్కుతిరిగి వెళ్ళిపోయాడు.

"పెద్దమనిషి". ఆ పదం అంటే ఆమెకు చాలా అసహ్యం. ఆమె జీవితం ఇలా కావటం వెనక చాలా

మంది పెద్దమనుష్యులున్నారు.

వారి పెద్దరికం అంతా తెల్లటి బట్టల్లో, బోడితలల్లో, గోల్డు ఫ్రేమ్ కళ్ళద్దాల్లో, మూడయిదుల సిగరెట్ ప్యాకెట్లలో నిక్షిప్తం చేయబడింది.

కంట్రాక్టర్ బిల్లులు కావాలంటే, అసెంబ్లీ సీటు కావాలంటే, ఏం కావాలన్నా అడది కావాలి. మనీ + షి = మనిషి అని యెవరో రచయిత అన్నాడు. ఈ సమాజంలో అదెంతో నిజం. బ్లేడ్ ప్రకటన నుండి మొదలయి యెలాంటి పనులకయినా స్త్రీని వినియోగించు కునే పెద్దమనుషుల్లో లేనివి కొన్ని ఉన్నాయి.

అవి.... అంతరాత్మ.... నిజాయితీ.

ఇందాకున్నంత ప్రశాంతత లేకపోయినా వెంటనే తేరుకోగలిగింది వాసంతి. తిరిగి మరోసారి లైట్‌గా మేకప్ చేసుకొని బయలుదేరింది.

వాకిట్లో వినయంగా చేతులు కట్టుకు నిలబడ్డాడు డ్రైవర్.

"కారు తీసుకురా."

వినయంగా వెళ్ళి కారు గ్యారేజ్ నుండి బయటకు తెచ్చాడు.

వాసంతి ఎక్కగానే కారు కదిలింది.

ఆ కారుకు నల్లటి అద్దాలున్నాయి.

వెనకాల అద్దాలకు తెరలున్నాయి.

2

గాల్లోకి లేచింది విమానం.

అప్పటికే అందరూ బెల్టులు కట్టుకున్నారు.

ఆనందరావు తొలిసారిగా విమానంలో ప్రయాణం చేస్తున్నాడు.

అందుచేత ఆనందరావుకి యెంతో ఆనందంగా ఉంది. యే మూలో కొంచెం ఆందోళన కూడా ఉంది. ఇటీవల విమాన ప్రమాదాల వార్తలు చదివాడు. ఆ వార్తలు చదివినప్పుడల్లా జీవితంలో విమానయానం చేయకూడదనుకునేవాడు.

కానీ ఈ రోజు ధైర్యంచేసి యెక్కాడు. బెల్టులు విప్పుకున్నాక పైనుండి క్రిందకు చూడాలని ఆత్రంగా ఉంది. ముఖ్యంగా ఆకాశంనుండి చూస్తుంటే కొండలు గుట్టలు, నదులు, మనుషులు ఎలా కనిపిస్తారో చూడాలని చాలాకాలంగా భావిస్తున్నాడు, యెదురు చూస్తున్నాడు కూడా.

ఎయిర్ హోస్టెస్ చాలా ప్లీజింగ్ గా వుంది. ఆమె మొఖంలోకి చూస్తుంటే, జీవితాంతం ఇలా గాల్లోనే యెగురుతూ ఆ మెతో ఉండాలనిపిస్తుంది. విమానం ఇప్పుడు సాఫీగా నడుస్తోంది.

ఆమె యెవరితో నవ్వుతూ పలకరిస్తోంది.

ఆమె తన దగ్గరకు వచ్చి మాట్లాడితే బాగుండునను కున్నాడు ఆనందరావు. అతని ప్రక్కన ఓ నడివయస్సు వ్యక్తి కూర్చున్నాడు. ఆయన ఈ ప్రపంచంతో యేం సంబంధంలేనట్లుగా యెటో చూస్తున్నాడు.

ఆనందరావు ముందునుందే ఓ వ్యక్తి నడుచుకుంటూ వెళ్ళాడు. ఆ విషయం ఆనందరావు అంతగా పట్టించుకో లేదు. ఆనందరావు చూపులన్నీ ఎయిర్ హోస్టెస్ మీదే నిలిచి ఉన్నాయి.

ఇంతలో యెవరిదో కెవ్వున కేక!

ఆనందరావు వెనక యెవరో నిలబడ్డారు.

"దయచేసి వినండి. యెవరూ కదలొద్దు. ప్లేన్

హైజాక్ చేయబడింది. మీ ఎవరిమీదా మాకు ద్వేషం లేదు. యేమాత్రం పిచ్చివేషాలు వేసినా నిర్దాక్షిణ్యంగా కాల్చేస్తాం."

ఆనందరావు తలనుండి పుట్టుకొచ్చాయి చెమటలు.

"ఇదేం ఖర్మరా భగవంతుడా. యెక్కా కెక్కా క విమానం యెక్కితే" అనుకున్నాడు.

అంతులేని భయం క్షణాల్లో ఆనందరావుని ఆవరించుకుంది. కడుపులో శూన్యంగానూ, దేవుతున్నట్లనిపించింది. సీట్లో వెనక్కు వాలిపోయాడు. కళ్ళు చూస్తున్నా మాట్లాడలేకపోతున్నాడు. ఆకస్మాత్తుగా కలిగిన భయం తాలూకు లక్షణాలవి.

ఆనందరావు ప్రక్కనున్న వ్యక్తి కదలబోయాడు.

"డోంట్ మూవ్."

ఎవరిదో ఏడుపు.

మరికొందరికీ హిస్టీరియా లక్షణాలు యేకకాలంలో పొడసూపాయి.

"హలో .... హలో ...." గ్రౌండ్ కంట్రోల్ నుండి అరుస్తున్నారు.

"ప్లేన్ ఈజ్ హైజాక్‌డ్" పైలట్ నిర్లిప్తంగా అన్నాడు.

సూర్యోదయించటం యెంత సాధారణంగా జరిగిపోతుందో, ప్లేన్ హైజాకింగ్ అంత సులభంగా సాధ్యపడుతుంది ఈ రోజుల్లో.

"లాహోర్ మళ్ళిస్తున్నాం. ఇంతవరకు వారి కోర్కెలేమిటో తెలియటంలేదు" గ్రౌండ్ కంట్రోల్‌కు రిపోర్టు అందింది.

లాహోర్ అధికారులతో మాట్లాడారు. వారు విమానం

దిగటానికి అనుమతించారు.

ఈ వార్త క్షణాల్లో ప్రపంచమంతటా తెలిసిపోయింది. ఆ విమానంలో యెక్కినవారి తాలూకు బంధువులనుండి అప్పుడే యస్.టి.డి.లు మొదలయ్యాయి.

హైజాకర్స్ తమ కోర్కెలు వెల్లడించారు.

“వారంతా ఓ టెర్రరిస్టు సంస్థకు చెందినవారు. వారి తాలూకు సభ్యుల్ని అరెస్టు చేశారు. వారిలో కొందరికి ఉరిశిక్ష పడింది. వారందరినీ విడుదల చెయ్యాలన్నదే హైజాకర్స్ డిమాండ్.”

సంప్రదింపులు జరుగుతున్నాయి.

భారత్ అధికారులు పాకిస్థాన్ అధికారుల్తో మాట్లాడుతున్నారు. యెప్పటికప్పుడు పరిస్థితి తెలియచేయబడుతోంది. మొత్తం హైజాకర్స్ నలుగురు. వారి దగ్గరకు ఆయుధాలు యెలా వచ్చాయో యెవరికీ అర్థంకావటం లేదు.

ఆనందరావు కొంచెం తేరుకున్నాడు. యే క్షణాన విమానం ప్రేల్చేస్తారోనని భయపడుతున్నాడు. మృత్యుముఖంలోకి వెళ్ళటం అంటే మొన్నటిదాకా అతనికి తెలియదు. వెంటనే తిరుపతి వెంకన్నకు మొక్కాడు- ప్రాణాల్తో బ్రతికి బయటపడితే నడిచి గుడికొస్తానంటూ.

అప్పుడు వినపడిందో శబ్దం.

ఓ వ్యక్తి అమాంతం ఎగిరి తన ప్రక్కనున్న టెర్రరిస్టు చేతిలోని తుపాకి లాక్కోపోయాడు. కొంచెంసేపు పెనుగులాట జరిగింది. టెర్రరిస్టు ఆ వ్యక్తి మెడప్రక్కగా ఓ దెబ్బ కొట్టాడు. కీచుమంటూ అరుచుకుంటూ పడిపోయాడు.

“షూట్ హిమ్” అరిచాడో వ్యక్తి.

"నో" అరిచాడు వాళ్ళ నాయకుడు.

"అలాంటి పిచ్చి పనులు చేయకద్దు. మనం నీతీ, నిజాయితీ లేనివాళ్ళం కాదు. మన ఆశయంకోసమే ఈ ప్లేన్ హైజాక్ చేశాం. అది నెరవేరటమే మనకు కావాలి. మనకు ప్రజలమీద ద్వేషంలేదు" అని తిరిగి అందరివంక చూశాడు.

"మాకు మీ ఎవరిమీద కోపంలేదు. మీరు మా శత్రువులు కాదు. మా సహనాన్ని పరీక్షించకండి. మేం ప్రాణాలకు తెగించి ఈ పనికి పూనుకున్నాం. ప్రాణాలంటే మాకు తీపిలేదు. ఎవరు సాహసం చేసినా ఈ విమానం బాంబుల్తో పేల్చేస్తాం."

కఠినంగా హెచ్చరించాడు.

అదే సమయంలో....

లాహోర్ అధికారులు అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు.

భవిష్యత్ కార్యక్రమం క్షణాల్లో రూపొందించబడింది.

కాకలుతీరిన 'కమేండో'లు రావించబడ్డారు.

3

కుక్కలదేం తప్పులేదు. అవి మొరిగాయి.

జనమే వాటిగురించి అంతగా పట్టించుకోలేదు. కారణం అవి ఊరకుక్కలు. ఊరికే అరుచుకుంటాయి. కొన్ని సందర్భాలలో ప్రపంచం మునిగిపోతున్నా చాలా నిశ్శబ్దంగా ఉంటాయి. మరో సమయంలో హృదయవిదారకంగా ఏడుస్తుంటాయి. ఎక్కువ భాగం ఊరికే కొట్లాడుతుంటాయి.

ప్రక్క వీధికి చెందిన కుక్క పొరపాటునో, గ్రహ

పాటునో వచ్చినా అవి భరించలేవు. తిరిగి వెళ్ళిపోయే దాకా ఆరాటమే. దాంతోపాటు యే మూల తమజాతి వారు అరిచినా వెంటనే ఆరంభమవుతుంది కార్యక్రమం. అన్నీ నోరెత్తి భౌ....భౌ....మనటమే.

మెలకువగా ఉన్నవారు ఈ రోజుకూడా కుక్కలు అలానే అరిచాయనుకున్నారు.

నిలువెల్లా ముసుగులు తొడుక్కున్న ఓ గుంపు ఆ కాలనీ మీదకు దాడిచేసింది. వారందరి దగ్గర గొడ్డళ్ళూ, బరిసెలూ ఉన్నాయి. వాళ్ళ నాయకుడి దగ్గర తుపాకి ఉంది. దాని గొట్టం పొడుగా ఉంది.

వాళ్ళా ప్రాంతాన్ని బాగా స్టడీచేశారేమో సరాసరి ఓ ఇంటి దగ్గరకెళ్ళి అడవిలో చెట్టు కొట్టినట్లుగా రెండు తలుపుల్ని బ్రద్దలు కొట్టేశారు. అవి విరిగి ముక్కలయి పోయాయి. అందరూ లోనికి వెళ్ళి అందిన వస్తువునల్లా తీసుకోవటం మొదలు పెట్టారు. ఇంటి వారంతా లేచి నోటమాట లేకుండా చూస్తున్నారు.

ఆ ఇంటాయనకు దేవుడంటే మహాభక్తి. డబ్బులంటే కూడా. ఆయన శ్లాబులో బోల్డంత డబ్బు సంపాదించి ఏం చేయాలో తెలీక, ఇరవైనాలుగు క్యారట్ల బంగారంతో తన ఇష్టదైవాల్ని చేయించాడు. అవి రాత్రిం బవళ్ళు మెరుస్తుంటాయి. దొంగలు బీరువా తాళాలు తీసుకున్నారు. ఆయన అంత తెలివితక్కువ వాడేంకాదు. తనకు చెందినవన్నీ లాకర్లో దాచుకున్నాడు.

అంతా అయ్యాక వారి చూపు బంగారు దేవుళ్ళమీద, షావుకారి భార్య మెడమీద పడ్డాయి.

"బంగారు విగ్రహాలు" అన్నాడో వ్యక్తి ఆనందంగా.

"ష్...." అన్నాడు నాయకుడు.

"అమ్మా....నీ మెడలోని నగలిస్తావా" అన్నాడు.

అప్పటిదాకా భయంతో బిగుసుకుపోయిందల్లా కదిలి వరసగా ఒకొ్కటి తీసి ఇవ్వటం మొదలు పెట్టింది.

"ఆ నల్ల పూసల గొలుసు....నాంతాడు ఉంచుకో" అన్నాడు నాయకుడు.

"అదేంటి గురూ....ఎట్టాలేదన్నా పదివేలు చేస్తాయి" అన్నాడో అనుచరుడు.

"ఊఁ" గద్దించాడు.

"వెళ్దాం పదండి" అన్నాడు నాయకుడు.

"బంగారు విగ్రహాలు" గొణిగారు.

"ముందు పదండి" అన్నాడు.

అందరూ వెనక్కి తిరిగారు.

"అది బంగారు విగ్రహం కావచ్చు. లేదా వజ్రాల విగ్రహం కావచ్చు. అది భగవంతుడిది. అలాగే ఓ ముత్తయిదువు మెడలో మంగళసూత్రం అపహరించటం మన పద్ధతి కాదు. మనకు కొన్ని సెంటిమెంట్లున్నాయి. భగవంతుడ్ని మోసం చెయ్యటం.... స్త్రీలు ప్రాణంగా చూసుకునే తాళిని దొంగలించటం మనకి నిషిద్ధం. మీరంతా ఈ విషయం గుర్తించుకోవాలి. మనకు సెంటిమెంట్లుండాలి. లేకపోతే మన పెళ్లాం, బిడ్డల్ని కూడా మరిచిపోతాం" అన్నాడు నాయకుడు.

4

అక్కడ సమావేశం అయిన వారిలో తెల్ల పంచెల, బట్టతలలవారే యెక్కువ వున్నారు. వారిముందు ఖరీదయిన విదేశీ మద్యం, గ్లాసులు, చిప్స్, చిల్లీ చికెన్, వేయించిన కారం జీడిపప్పూ వున్నాయి.

"బజారు ముండకూడా ఎక్కు అయిపోతే" అని

బాధపడ్డాడు జగన్మోహనరావు.

ఆయన పెద్ద కంట్రాక్టర్. అధికార పార్టీ రాజకీయాల్లో పాలుపంచుకుంటున్నాడు. వాసంతిని తమ నాయకుడి కొడుక్కి తార్చాలని భంగపడినవాడు.

"ఎవరయ్యా అది" అన్నాడో పెద్దమనిషి.

"ఇంకెవరు. ఆ వాసంతి."

"ఓ. ఆ అమ్మాయా....మన కళ్ళముందు యెంత ఎదిగిపోయింది. దానికో భవనం, ఘూర్ఖా, పనిమనుషులు, కారు, ఎ.సి. గది."

"అందుకే అంత పొగరు బలిసింది. దానికో పాఠం చెప్పాలి."

"ఏమందయ్యా."

"మన బ్రహ్మానందంగారబ్బాయి మొన్నొస్తే, వేరే ఎంగేజ్‌మెంట్ వుంది. వీలుకాదంది. దాన్నేం చెయ్యాలంటావు."

"ఏం చేస్తాం. దాని పరపతి అంత పెరిగిపోయింది."

"ఏం పరపతయ్యా....వళ్ళమ్ముకొనేది."

"దాని చుట్టూ నేగా మనం తిరిగేది."

"....అయితే."

"అయితే ఏమిటి. అది వళ్ళమ్ముకుంటోంది. మనం ఇంకోటమ్ముకుంటున్నాం. ఎవడికో దాన్ని తార్చటం బ్రోకరేజీ అవుతుంది. అంతటితో ఆగుతున్నామా? బిల్లులు శాంక్షన్ చేయించుకోవాలంటే అడ్డమయిన వాడికల్లా ఆ పని చేస్తున్నాం. అంతమాత్రాన మన విలువ తగ్గిపోయిందా. లేదు. ఇవాళ దేశానికి కావలసింది ఎలా సంపాదించామన్నది కాదయ్యా....యెంత సంపాదించామన్నది. వాసంతి తను వప్పుకున్న వాడిదగ్గర

కెళ్ళింది. మంచిదే.... నేను అభినందిస్తున్నా."

"మనోడికి అప్పుడే మొదలయింది" అన్నాడు జగన్మోహన్రావ్ మిత్రుల్తో. నవ్వులు వినిపించాయి.

"ఓర్నీ! నాకింకా మొదలవలేదుగాని, ఓ ముక్క చెప్పనీరా. మనం తాగుబోతునాకొడుకులమే అనుకో. బేవార్స్‌గాళ్ళమే అనుకో.... మనం చేసే వెధవ పనుల గురించి చెప్పుకోలేమా? అంత దరిద్రులమా" అన్నాడాయన.

"ఇదిగో నువ్వు వాసంతితో మనల్ని పోల్చకు."

"అది మహా తల్లిరా నాయనా. దాంతో మనల్ని పోల్చటం నా తప్పే!"

"ఓరి....వాడికూడా 'అంతరాత్మ .... నిజాయితీ' అంటూ మొదలయిందే" అన్నాడు జగన్మోహన్రావ్.

5

ప్రకాశరావు చాలా కాలంగా ఆ ఊరిలో గట్ల పేరుతో కొంచెం కొంచెం ఆక్రమించుకుంటూ, బంజర్లు రాయించుకుంటూ ప్రెసిడెంటుగిరి వెలగబెట్టడంతో సంతృప్తి చెందక వాటన్నింటినీ వాయిదా వేసుకొని, తనకంటూ ఓ జత రాజకీయ బట్టలు, ఓ టోపీ ఏర్పరుచుకుంటున్న దశలో రాజకీయ రంగంలో ఓ ఉప్పెన వచ్చింది.

మూడు దశాబ్దాలుగా రాజ్యమేలుతున్న అధికార పార్టీ మీద తిరగబడ్డాడు క్రొత్త నాయకుడు. ఆయన యెక్కడకు వెళితే అక్కడకు విపరీతంగా జనం వస్తుండటంతో 'ప్రకాశరావు' దృష్టి ఆ వైపు పడింది.

దూరదృష్టితో ఆలోచించి, ఓ పత్రికా ప్రకటన చేసి ఆ నాయకుడి దగ్గరకెళ్ళాడు. ఆయన కూడా ఇలా

ఒక్కొక్కరు తన మహా యజ్ఞంలో పాలుపంచుకుంటున్నందుకు మహా సంబరపడిపోయి ప్రకాశరావుకు ఆ జిల్లా బాధ్యతలు అప్పగించేశాడు. ఆయనతోపాటు జిల్లా అంతా తిరిగి, ముందు కొంచెం డబ్బు ఖర్చుపెట్టి, భవిష్యత్ కోసం ఎదురుచూస్తుండగా ఎన్నికలొచ్చాయి.

ప్రకాశరావుకు టిక్కెట్టు వచ్చింది. పోటీగా హేమాహేమీ నాయకుడు. ఆయనకాక మరో ఏడుగురు. అయినా నిరుత్సాహం పొందలేదు.

ఎదురు పార్టీవాళ్ళు తమ నాయకుడ్ని తెస్తే లక్ష మందొచ్చారు. తమ నాయకుడ్ని తెస్తే లక్షన్నరమందొచ్చారు. ఇదెంత క్రొత్త మోజని ఎవరెంతగా తీసేసినా ఓట్లు మాత్రం ప్రకాశరావుకు విపరీతంగా పడ్డాయి. గిట్టనివాళ్ళు ఆ ఓట్లు పడింది ప్రకాశరావుకు కాదు. ప్రకాశరావనే వాడెవడో వాడుండే సందులోనే ఎవరికీ తెలీదు. ఆ ఓట్లన్నీ ఆయన నాయకుడి మొఖంచూసి వేసినవే అన్నారు.

ప్రకాశరావు ఆ విషయం కాదనలేదు, ఈ విజయం నాది కాదు. ఆయనదే. ప్రజలదే అని ప్రకటించి ఆయనకు మొక్కాడు.

లోకల్ పేపర్ విలేకర్లు కొందర్ని డబ్బుల్తో బుట్టలో వేసుకొని 'మంత్రి కాబోతున్నాడని' రాయించుకున్నాడు. అందుకు కూడా కారణం ఉంది.

అంతకుముందు ప్రభుత్వం సగంమంది ఎమ్మెల్యేలకు మినిష్టర్లు, కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు కట్టబెట్టారు. ఎవరికీ మెజార్టీ రాకుంటే తన పని గిరాకి ఉంటుందని భావించాడు గాని, వాళ్ళ పార్టీకే బంపర్ మెజార్టీ

వచ్చింది.

కేవలం డజను మందిని మంత్రులుగా తీసుకున్నారు. చైర్మన్ అనే పదానికి తావులేకుండా పోయింది. మంత్రిగా తన పేరులేదు. ప్రకాశరావు కంగారుపడ్డాడు. నువ్వేం కంగారుపడకు అని అభయ హస్తమిచ్చాడు భానోజీరావు.

సంవత్సరం గడిచాక ఓ శుభోదయాన ప్రకాశరావుకు కబురు వచ్చింది.

భానోజీరావు పథకం ముందుంచాడు.

"మొత్తం సగంమంది బయటకు వస్తే ప్రతి పక్షం వారిని కలుపుకొని ప్రభుత్వం ఏర్పాటుచేస్తాం. మంత్రి వర్గంలో నీకు స్థానం కల్పిస్తాం."

ప్రకాశరావు మాట్లాడలేదు. ఆయనకు ఈ నడుమ తమ నాయకుని ఆదరణ లభించుతున్నట్లుంది. పార్టీ ట్రెజరర్ గా తననే వుంచాడు. తాళాలు మాత్రం యివ్వ లేదు. రేపో మాపో ఇవ్వడా అని వుంది.

"ఏంటయ్యా అంత ఆలోచిస్తున్నావు. ఆ తాళాలు నీకిస్తాడా! ఛస్తాడా? ఈ ఎన్నికల్లో ఎంత ఖర్చు పెట్టావ్. ఒకటా.... రెండా? అవన్నీ యెప్పుడు సంపాదిస్తావు? నువ్వు సరేనను. అయిదు లక్షల్తోపాటు మంత్రి పదవి ఇస్తాం."

"నా నియోజకవర్గం వారితో ఆలోచించి చెబుతాను" అన్నాడు ప్రకాశరావు. తొందరపడటం అతని స్వభావం కాదు.

"నీ ఇష్టం నీ భవిష్యత్ యెలా మార్చుకుంటావో" అని భానోజీరావు వెళ్ళిపోయాడు.

ఆ రోజు అర్థరాత్రి ప్రభుత్వం కూలిపోయింది.

ప్రకాశరావుకు తిరిగి కబురు వచ్చింది.

తాజా రేటు! పదిహేను లక్షలు.

ఎమ్మెల్యేలను తెస్తే వారికొక్కరికి పదిలక్షలు. కమీషన్‌గా కొంత వుంటుంది. మంత్రి మామూలే.

ప్రకాశరావు అంతరాత్మ నిద్ర లేచింది.

మనస్సాక్షి ప్రశ్నించటం మొదలుపెట్టింది....

ఈ కథను ప్రస్తుతం ఇక్కడ ఆపాల్సి వచ్చింది. క్షమించండి. వెనక్కి వెళ్దాం.

6

"అంచేత, దాని మొఖం అంత అందంగా వుంది కాబట్టి, ఆ అందంతో పాటు దానికి గర్వం పెరిగింది కాబట్టి, దాని మొఖం మొ ఖ ం లా ఉండకూడదు" అన్నాడు జగన్మోహనరావు.

"మరి?"

"కాగయిపోవాలి, కష్టయిపోవాలి. బీభత్సం అయిపోవాలి."

"ఏం చేస్తానంటావ్?"

"యాసిడ్ పోస్తాను."

"నువ్వేనా?"

"పిచ్చి ప్రశ్న. వెధవ పనులు అందరూ స్వయంగా చేయరు. ఆదేశాలిస్తారు."

"ఆమె కారు అద్దాలు మూసివుంటాయి."

"అయినా అవి బద్దలవుతాయి."

"ఎప్పుడు చేస్తారా పని?"

"మరోసారి పిచ్చి ప్రశ్న. మన దేశానికి స్వాతంత్ర్యం అర్ధరాత్రి వచ్చింది. అంచేత మన సంప్రదాయం ఏమంటే ఏ దరిద్రపు పనిచేసినా పొద్దుపోయాకే."

గొల్లున నవ్వులు... గ్లాసుల మ్రోతలు....

ప్లాను సిద్ధం అయింది.

వారం రోజుల తర్వాత వాసంతి కారు దూసుకొస్తూ సడన్ బ్రేకుతో ఆగింది. రోడ్డు నడుమ యెవరిదో కారు ఆగిపోయింది. హారన్ మ్రోగిస్తుండగా బిలబిలమంటూ దూసుకొచ్చారు పదిమంది గూండాలు.

భళ్ళున అద్దాలు పగిలిపోవటం....

యాసిడ్ సీసాలు బద్దలు కావటం....

వాసంతి మొఖంమీద....వంటిమీద పడటం క్షణాల్లో జరిగిపోయాయి.

కెవ్వున కేక. హృదయవిదారకంగా.

వెనక సీట్లో గిలగిల కొట్టుకుంటున్న వాసంతి....

బుసబుస పొంగుతున్న యాసిడ్ ప్రభావం....

కణకణ మండుతున్న నిప్పుల్తో మొఖాన్ని కాలుస్తున్నట్లు బాధ....కేకలు....ఏడుపు....!

ముందు తేరుకుంది డ్రైవర్. వేగంగా బ్యాక్ చేశాడు. వెనకాల యెలాంటి బండ్లు రాకపోవటం అదృష్టం. కొంచెం దూరం వెళ్ళాక, అదే వేగంతో టర్న్ చేసుకొని హాస్పిటల్ వైపు దూసుకుపోయాడు వేగంగా.

వాసంతికి ఓ విషయం తెలియదు. తనమీద కాదు యాసిడ్ పోసింది! తన అంతరాత్మమీద! తన నిజాయితీ మీద!

వాసంతి గెలిచింది!

వేశ్యగా బ్రతకాల్సిన పరిస్థితుల్లో రాజీపడటంకాదు. ఆమెకలా బ్రతకటం ఓ శిక్ష అయితే....అందులో అయినా నిజాయితీగా ఉన్నందుకు మరో శిక్ష ఇది.

హైజాకర్స్‌తో ఎప్పటికప్పుడు సంభాషణలు జరుపుతున్నారు అధికారులు.

"మీ కోర్కెలు భారత దేశానికి తెలియచేశాం. త్వరలోనే ఏ విషయం మీకు తెలియచేయబడుతుంది. ఈలోపు మీరేం తొందరపడవద్దు. విమానం పేల్చేయటంలాంటి పనులు చేయొద్దు.

ఈ విషయం గురించి అత్యవసర సమావేశం ఏర్పాటు చేయబడింది. మరో అరగంటలో నిర్ణయం తెలియచేయగలరనుకుంటున్నాం."

"మీరేమైనా కుట్రచేస్తే ఈ విమానం పేల్చేస్తాం. మా దగ్గర బాంబులున్నాయి" హైజాకర్స్ బెదిరింపు.

"నో, అలాంటిదేం లేదు."

"అరగంటలో మాకు సమాధానం రాకుంటే మేమీ ప్రాంతం విడిచి వెళ్ళిపోతాం."

"అలాగే."

"ఫ్యూయల్ సరిపోదు" పైలట్ అభిప్రాయం.

"దీంట్లో సరిపోయినంత ఫ్యూయల్ నింపాలి. లేదా ఇప్పుడే పేల్చేస్తాం."

"ఓ.కె. మీ కోరిక అంగీకరించబడింది."

విసుచుకుపడిపోయాడు ఆనందరావు.

"అయ్యయ్యో" ఒక్కసారిగా గందరగోళం.... ఏడుపులు....

"షటప్. అర్చారంటే కాల్చేస్తాం" అరిచారు.

ఆనందరావు కళ్ళు తేలేస్తున్నాడు. ఆనందరావు మహానటుడు కాదుగాని, ఓ మోస్తరు నటుడే. 'ఆ ముఖమే ఓ విషాద పాత్ర' అన్నాడు ఓ వర్ధమాన కవి ఆనంద

రావు మొఖం చూసి.

ఆనందరావు ఎప్పుడూ పేథాస్ పాత్రలే వేస్తుంటాడు. హీరోయిన్ తండ్రిగానో, తాతగానో, మామగానో వేసి, దగ్గో, గుండెనొప్పితోనో అన్ని పాత్రాలూ మధ్యలో నిష్క్రమించేవే. మరీ వీరావేశంతో నటిస్తుంటాడేమో కొన్నిసార్లు బహుమతులొచ్చినా దగ్గినందుకు చాలా రోజులు బాధపడేవాడు. ఇప్పుడు సందర్భం వేరు.

మొదటినుండి భయపడి ఛస్తున్నాడు. అందుకే అంత సహజంగా నటించాడు....

"చచ్చిపోతాడేమో" అన్నారెవరో.

"దయచేసి ఆయన్ని బయటకు పంపండి" అంటున్నారెవరో.

"అకలే" ఓ పాప ఏడుస్తుంది.

నాయకుడు వారందరివంక చూశాడు.

"పిల్లల్ని, ముసలివారిని పంపించేద్దాం" అన్నాడతను.

"నో" అన్నాడు ఒకతను.

"అతన్ని చూడు. ఛస్తే మనల్ని అనుకుంటారు. మనవాళ్ళని రక్షించుకోవటానికి అనవసరంగా అమాయకుల్ని చంపటం నా కిష్టంలేదు."

"నీ ఇష్టం."

"డోంట్ వర్రీ. ఇరవైమంది వెళతారు. అయినా చాలామంది ఉన్నారు."

వెంటనే కంటాక్టు చేశారు. లాడర్ తీసుకురాబడింది.

"మీరెవరూ కదలొద్దు. మేం వెళ్ళమన్నవారు వెళ్ళాలి" కటువుగా హెచ్చరించాడతను.

ఎవరూ మాట్లాడలేదు. వారందరి మొఖాల్లోనూ

భయాందోళనలు. ఏ క్షణాన ఏమవుతుందో తెలియదు. తమందరి ప్రాణాలు కాపాడటానికి ప్రభుత్వం ఏమైనా చర్యలు తీసుకుంటుందా? నమ్మకం లేదు. ఇన్నది భారత దేశంలో కాదు. పాకిస్తాన్ కూ, భారతదేశానికి నడుమ సంబంధాలు సరిగ్గా లేవు. వారంత ప్రమాదకరమైన వ్యక్తులైతే విడిచిపెట్టరేమో!

అందుకోసం తమందరినీ బలిచేస్తారా? లేదు ఏదో చేస్తారు! ఏం చేస్తారు? యేమో! బ్రతికి బయటపడటం జరుగుతుందా? తిరిగి ఇండియా వెళ్ళేదెప్పుడు? ఆత్మీయుల్ని అక్కున చేర్చుకొనే దెప్పుడు?

మరికొందరి ఆలోచనలు మరోవిధంగా వున్నాయి. హైమీజ్ మనీ అనుకునే బిజినెస్ మాగ్నెట్ లు అందులో వున్నారు. వారికి జీవితంమీద అంత టెంక్షన్ గా లేదు. ఎందుకంటే హైజాకింగ్ కేసుల్లో యెక్కువ భాగం సుఖాంతం అయ్యాయి. ఇందులో నుండి బయటపడటం అనేది అసలు సమస్య కాదు. అదెప్పుడయినా జరిగితీరుతుంది.

కానీ ఈ గంటలు....తిరిగి జీవితంలోకి రావు. కొన్ని నిముషాల వ్యవధిలోనే ఓడలు బండ్లు అవుతాయి. బండ్లు ఓడ లవుతాయి. నిజంగా యెంత నష్టమో తలుచుకుంటే వారికి బి పి. రైజ్ అవుతోంది. అయినా యేం చెయ్యగలరు?

హైజాకర్స్ ఒక్కొక్కర్ని చెక్ చేసి పంపుతున్నారు. డోర్ దగ్గర తుపాకితో ఓ వ్యక్తి నిలబడ్డాడు.

ఆనందరావును బయటకు వెళ్ళనివ్వా లేవలేక పోయాడు. "వోవర్ ఏక్షన్ చెయ్యకు" అని హెచ్చ

రికలు వస్తున్నాయి. అలానే వుండిపోయాడు. ఎయిర్ హోస్టెస్ సహాయం కోరారు. ఆనందరావు జీవితంలో మరపురాని అనుభూతి అది.

అదేకాదు ఎగస్ట్రా పాత్ర చివరి రీల్లో హీరోగా మారినట్లు ఆ నం ద రా వు నిర్వహించబోయే పాత్ర ముందుంది!

ఎయిర్ హోస్టెస్ వచ్చింది. ఆమెతో పాటు వచ్చిన సెంటువాసనకు ఆనందరావు దిమ్మెరపోయాడు. లేచినిల బెట్టారు. ఆమె భుజంమీద వాలిపోయాడు. ఆమె ముఖంలో చెక్కుచెదరని చిరునవ్వు. ఆమె కొంగు కదులుతుంటే చంద్రలోకంలో విహరిస్తున్నట్లుంది. ఇలానే ఓ జీవితకాలం నడిస్తే బాగుంటుందనుకున్నాడు. త్వరగానే డోర్ దగ్గరకు వచ్చారు. మెల్లగా క్రిందకు దిగాడు.

ఆనందరావు దిగగానే తొందరపడలేదు. ఒక్కసారి సంతోషంతో పిచ్చెత్తినట్లుగా పరుగెత్తాలనుకున్నాడు. మిగతావారంతా అలా చేశారు. కనీసం తన ఆనందాన్ని నడకలో అయినా చూపించలేదు. వెనకనుండి తనను గమనిస్తుంటారని.... అక్కడినుండి బుల్లెట్లు దూసుకొచ్చి తన వెన్నును చీల్చేస్తే.... ఊరుగాని ఊరు.... దేశంగాని దేశం....

ఆనందరావు నీరసంగానే నడుచుకుంటూ వెళ్ళాడు. లోపలకు వెళ్ళాక వాళ్ళిచ్చిన కూల్ డ్రింక్ త్రాగాడు.

భారత ప్రభుత్వం నుండి మెసేజ్ వచ్చింది.

“హైజాకర్స్ కోరికలు అంగీకరించటం సాధ్యం కాదు. అలా చెబితే అంతమంది ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుంది కాబట్టి సమయంగడిపే ఎత్తుగడల్ని అనుసరించాలి. అంతగా అయితే వారిని మరోచోటికి పంపాలి.

ఈలోపు యేదో నిర్ణయం తీసుకుంటానికి వీలుంటుంది"
ఇదీ సారాంశం.

అంతటితో ఆగలేదు.

"హైజాకర్స్ పట్టుబడగానే మాకు అప్పగించాలి."

"ఆ విషయం మేం వెంటనే హామీ యివ్వలేం"
అన్నారు పాకిస్థాన్ అధికారులు.

ఆనందరావుకు దూరంగా విమానం రాక్షసుడిలా కన్పిస్తోంది. అంతలో యెవరో ఆనందరావును పిలిచారు.

ఆనందరావు చెబుతున్నాడు. ఎంతిమంది హైజాకర్స్ వున్నారో ....వారిదగ్గర ఎలాంటిఆయుధాలున్నాయో.... ఏ ఏ పొజిషన్లో వున్నారో అంతా.... వెంటనే 'కమెండో'లు ప్లాన్ తయారుచేసుకున్నారు.

"ఇంజన్ ట్రబులిస్తోంది" అన్నాడు పైలట్.

"నిజమా?" కఠినంగా అన్నారు.

"నిజమే. కావాలంటే మీరు చెక్ చేసుకోవచ్చు."

"ఇప్పుడేం చెయ్యాలి?"

"మెకానిక్‌లను పిలవాలి."

"ఇదేం కుట్ర కాదుగదా?"

"కాదు. ఇప్పుడు బాగు చేయకుంటే ఒకళ్ళం కూడా బ్రతికం."

వెంటనే కాంటాక్టు చేశారు.

"ఒకడు చాలడా?"

"లేదు. ఇద్దరు కావాలి."

"ఇంజన్ ట్రబులిస్తుందంటున్నారు. మరోసారి హెచ్చరిస్తున్నాం. ఏమాత్రం సాహసం చేసినా విమానం ప్రేల్చేస్తాం. ఇద్దరు మెకానిక్‌లు రావాలి."

"అలాగే."

"నా కెందుకో అనుమానంగా వుంది" అన్నా డో వ్యక్తి.

"బీ ఎలెర్ట్" అన్నాడు నాయకుడు.

తమ మానవత్వం తమని పట్టిస్తుందని ఆ క్షణం తెలియదు.

మెకానిక్ల వేషంలో కమేండోలు వచ్చారు.

రెండు నిముషాల అద్భుత దృశ్యం!

రక్తపాతం లేకుండా నే విమానం స్వాధీనమయింది.

హైజాకర్స్ తలలు వంచుకున్నారు.

ఓడిపోయింది వాళ్ళు కాదు.

గెలిచింది 'కమేండో'లు కాదు.

"మానవత్వం."

8

"నా వెనకాల నలుగురున్నారు" అన్నాడు ప్రకాశ రావు.

"వాళ్ళంతా అటు వెళతానంటున్నారు. వాళ్ళ నాపటం చాల కష్టంగా వుంది. నాకూ కూడా ఫోన్లు వస్తున్నాయి. ఆ వత్తిడి భరించటం కష్టంగా వుంది."

భానోజీరావు యేం మాట్లాడలేదు. అతని కిదంతా కొట్టిన పిండిలా వుంది. గ్రోత్ వి. ఐ. పి సూట్ కేస్ తెరిచాడు.

"మొత్తం నలభై లక్షలు."

వాటివంక చూడగానే ముఖంలో వెలుగురేఖలు. తన జీవితంలో యెన్నడూ అంత డబ్బును చూసి యెరుగడు. అయోమయంగా చూస్తున్న ప్రకాశరావు భానోజీ మాటల్లో ఈ లోకంలో పడ్డాడు.

"నువ్వు అనుమానపడకు. అది వైటే."

ప్రకాశరావు మాట్లాడలేదు.

"ఎల్లుండి ప్రమాణస్వీకారం చెయ్యాలి."

"ఎవరు?"

"నీతో పాటు మరికొందరు."

ప్రకాశరావుకు ఆనందంతో మాటలు రావటంలేదు. అతని చిరకాల వాంఛ మంత్రి కావాలని. కనీసం ఒక్క రోజయినా మంత్రిగా వుండి చచ్చిపోవాలని. భానోజి వాగ్దానాలు యింకా ప్రవాహంలా దూసుకొస్తు న్నాయి.

"మంత్రి అంటే మామూలు కాదు, క్యాబినెట్. అందులో నీకు మంచి శాఖ యిస్తాను. ఆ నలుగురికి డబ్బులు పంచు. నువ్వెంతమందిని తెస్తే అంత ప్రతిఫలం వుంటుంది. సాధ్యమైనంతవరకూ అందరికీ కార్పొరేషన్ ఛైర్మన్ పదవు లిద్దాం. లేకపోతే సృష్టించుదాం. అంతా మన చేతుల్లో పని. నువ్వు మాత్రం తయారుగా వుండు ప్రమాణస్వీకారం చెయ్యటానికి. వచ్చినవాళ్ళు బయటకు వెళ్ళకూడదు. తిరిగి మనమీద విశ్వాసతీర్మానం నెగ్గేదాకా వాళ్ళంతా మనలోనే ఉండాలి. అర్థ మయిందా?"

అప్రయత్నంగా తలూపాడు ప్రకాశరావు.

భానోజిరావు వెళ్ళిపోయాడు.

ప్రకాశరావు ముందు నలభై లక్షలు!

క్యాబినెట్ హోదా పదవి!

అప్పుడే మొదలయింది అతనిలో సంఘర్షణ.

రాష్ట్ర రాజకీయ చరిత్రలో తనేమిటో, ఎవరో మొన్నటిదాకా. తన గతచరిత్ర తెలిసి కూడా తన నెన్ను కున్నారు తన ప్రజానీకం. అందుకు కారణం తమ నాయ

కుడు. ఆయనమీద అపారమైన నమ్మకంతో, అభిమానంతో ఎన్నుకున్నారు. అప్పటి కోలాహలం గుర్తొచ్చింది. తనమీద నిలబడింది ప్రముఖుడు. డబ్బున్నవాడు. తమ కార్యకర్తల్ని ఎందర్ని కొట్టాకో! ఎవరికి వారు కదిలి తమ వెన్నుకంటే తామే స్వయంగా వెన్నుపోటు పొడిచారు.

వెన్నుపోటు పొడిచేముందు ఎవర్ని సంప్రదించారు? అంతరాత్మ తిరగబడింది. గొంతు నొక్కేశాడు. నీతి.... నిజాయితీ వదిలేశాడు. సెంటిమెంట్లు, మానవత్వం తుంగలో తొక్కాడు. ఆ సమయంలో తన తల్లీ, పెళ్లాం, బిడ్డలు ప్రజలు యెవ్వరూ గుర్తుకురాలేదు.

వెన్నుపోటుకు రంగులద్దాడు.

లొంగుబాటుకు తేనె పూశాడు.

ప్రజల్ని మోసం చేశాడు.

ప్రజాస్వామ్యాన్ని చిత్రవధ చేశాడు.

రెండురోజులు పోయాక....

పోలీసుల బందోబస్తుతో, అన్ని బూతుల్తో ప్రమాణ స్వీకారం చేశాడు మంత్రిగా.

ప్రకాశరావు చేసిన ద్రోహానికి ఆగ్రహించిన ప్రజలు అతని ఆస్తిని ధ్వంసం చేశారు. అయినా వారి ఆగ్రహం చల్లారలేదు. ప్రకాశరావు కూడా ఆగ్రహం చెంది పోలీసుల్ని దించాడు. వాళ్ళు కాల్పులు జరిపారు. అందులో ఎనిమిదిమంది చనిపోయారు.

ప్రకాశరావుకు రవంత బాధ కలగలేదు. అదనంగా గూండాల్ని నియమించాడు. ప్రజావాణిని నొక్కేయాలనుకున్నాడు.

నష్టపోయిన ఆస్తికి పరిహారం తీసుకున్నాడు.

ముగింపు

ఈ దేశంలో నీచంగా మోడబడ్తూ బ్రతుకు వెళ్ళు కొస్తున్న వేశ్యల్లో నిజాయితీ వుంది.

దోపిడీ దొంగలకు సెంటిమెంట్లున్నాయి.

రాక్షసంగా ప్రవర్తించేవారిలో సైతం మానవత్వం వుంది.

అయితే అవన్నీ వారి జీవితాల్లో తీరని ప్రతిబంధకా లవుతున్నాయి. వారి 'నేరాలకు' వారు శిక్షింపబడు తున్నారు.

ఏ విలువలూ లేని, ఏ నీతి నిజాయితీలకు లొంగని, భావకు అందని కౄతపూరితుడైన 'రాజకీయవాది' మాత్రం తన నేరాలకు శిక్షగా జనాన్ని పరిపాలిస్తు న్నాడు.

జనం యే విలువలకు కట్టుబడి వుంటారో, సరిగ్గా వాటికి వ్యతిరేకం 'రాజకీయం'.

"రాజకీయాల్లో ఏమయినా జరగొచ్చు" అనే ముద్దు మాటల్లో తమ అభిమానాన్ని, ఆత్మగౌరవాన్ని, సెంటి మెంట్లని, మానవత్వాన్ని, సమస్త విలువల్ని అమ్ముకొని, చంపుకొని అధికారంలో పాలుపంచుకుంటున్నారు.

ప్రకాశరావు మంత్రయ్యాడు.

తుపాకులూ, లాఠీకొయ్యలూ, టియర్ గ్యాస్‌లూ, ఉపయోగించి తన అధికారం నిలబెట్టుకోవాలని ఆరాట పడుతున్నాడు.

ఇంతటితో ఈ కథ ముగిస్తేమట్టుకు ప్రజలకు అన్యాయం చేసినట్లవుతుంది.

ప్రకాశరావు మంత్రయిన చాలా కాలానికి యీ

30

విషయం జనం మరిచిపోయారని బాగా నమ్మకం కుదిరాక తన ఊర్లో బహిరంగ సభ పెట్టేడు. బోలెడంత బందోబస్తు చేయించాడు. తన ఊరి ప్రజానీకం ముందుకొచ్చి మహోద్రేకంతో మాట్లాడుతుంటే జనంలో నుండి ఓ యువకుడు దూసుకొచ్చి....

టప, టప మంటూ కాల్చేశాడు.

నుదురులోనూ, గుండెల్లోనూ తూటాలు దిగి, రక్తం వెల్లువలా కారుతుంటే ప్రకాశరావుగారు కూలిపోయేరు.

ప్రకాశరావుగారు చచ్చిపోయేరు.

ఇప్పుడు కాదు.

తన్ను తాను అమ్ముకున్న రోజునే!

—: అ యి పో యిం ది :—